కిసాన్ సమ్మాన్.. బక్కచిక్కెన్!

ఏటా తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య ● అడ్డమైన కొర్రీలతో సంఖ్య కుదింపు

ఒక్క జగిత్యాలలోనే 73,405 మంది కట్ ● రేషన్‌కార్డులో ఒక్కరికి మాత్రమే వర్తింపు

రూ.10 వేల పెన్షన్ అందుతున్నా అంతే ● ఇన్‌కంట్యాక్స్ రిటర్న్స్ దాఖలు చేసినా మాయం

ఉమ్మడి కుటుంబంలో ఉన్నా గాయబ్ ● నిబంధనలు లేకుండా అమలైన రైతుబంధు

ఏటేటా పెరిగిన రైతుబంధు లబ్ధిదారులు ● ఐక్యరాజ్యసమితి సైతం ప్రశంస

జగిత్యాల, ఏప్రిల్ 29, (నమస్తే తెలంగాణ): రైతుబంధు.. ఈ పేరు వింటే వెంటనే కేసీఆర్ గుర్తొస్తారు. పెట్టుబడి సాయం కింద రైతులకు అందించే సాయం ఐక్యరాజ్యసమితి ప్రశంసలు సైతం అందుకుంది. సమయం రాగానే టంచన్‌గా రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. వాటిని పెట్టుబడిగా పెట్టుకుని అన్నదాతలు సంతోషంగా పంటలు సాగుచేసేవారు. కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేసిన రైతుబంధు పథకాన్ని స్ఫూర్తిగా తీసుకున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 2018 డిసెంబర్‌లో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ఓ పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఐదెకరాల లోపు భూమి ఉన్న చిన్నసన్నకారు రైతులకు ఏడాదికి 6 వేల రూపాయలను మూడు విడతల్లో అంటే ఏప్రిల్, ఆగస్టు, డిసెంబర్ మాసాల్లో అందిస్తామని ప్రకటించింది. నాడు అట్టహాసంగా ప్రారంభించిన ఈ పథకం ఇప్పుడు చిక్కిశల్యమవుతున్నది. అర్థంపర్థంలేని ఆంక్షలు రుద్దుతూ లబ్ధిదారులను ఒక్కొక్కరుగా తొలగిస్తున్నది. నాడు కేసీఆర్ హయాంలో ఒక్కటంటే ఒక్క నిబంధన కూడా లేకుండా స్వేచ్ఛగా పథకాన్ని అనుభవించిన అన్నదాతలు కిసాన్ సమ్మాన్ విషయంలో మాత్రం ఆంక్షల వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు.

సగానికి సగం తగ్గిన లబ్ధిదారులు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ రైతుబంధు పేరుతో పంటసాయంగా ఎకరానికి రూ. 5 వేల సాయాన్ని ప్రకటించారు. రైతు సంక్షేమం, పెట్టుబడి సాయం కోసం అమలు చేసిన ఈ పథకంపై ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసలు కురిపించింది. పథకం ప్రారంభించిన తర్వాత ప్రతి ఏటా లబ్ధిదారుల సంఖ్య పెరుగుతూ వచ్చింది తప్పితే తగ్గింది లేదు. అదే సమయంలో కేంద్రం తీసుకొచ్చిన కిసాన్ సమ్మాన్ మాత్రం ఏడాదికేడాది బక్కచిక్కిపోతున్నది. 2019-20 సంవత్సరంలో 8.23 కోట్లు ఉన్న లబ్ధిదారుల సంఖ్య 2023-24లో 7.56 కోట్లకు పడిపోయినట్టు గణాంకాలు చెప్తున్నాయి. ఒక్క జగిత్యాల జిల్లాలోనే లబ్ధిదారుల సంఖ్య వేలల్లో పడిపోయింది. డిసెంబర్ 2018లో ఈ పథకం ప్రారంభం కాగా, జిల్లాలో 1,44,545 మంది రైతులకు రూ.28.91 కోట్ల పంట సాయం అందింది. నిరుడు ఆగస్టులో 15వ క్వార్టర్ నాటికి లబ్ధిదారులకు అందిన సాయం రూ. 14.23 కోట్లకు పడిపోయింది.అంటే ఈ మధ్యకాలంలో ఏకంగా 51 శాతం మంది లబ్ధిదారులను అంటే 73,405 మంది రైతులను వివిధ కారణలను సాకుగా చూపి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పరిధి నుంచి తొలగించారు.

పెరుగుతూ పోయిన రైతుబంధు సాయం

కేంద్ర సర్కార్ ఇచ్చే పంట సాయం రోజు రోజుకూ చిక్కి శల్యమైతే, రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతుబంధు సాయం మాత్రం అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. 2018లో అప్పటి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు ప్రారంభించింది. జగిత్యాల జిల్లాలో మొదటి ఏడాది 1,76,928 మంది రైతులకు రెండు దఫాల్లో రూ.310.97 కోట్ల పంట పెట్టుబడిని రైతుబంధు కింద అందజేసింది. ఈ సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతూ వచ్చింది. 2019లో 1,81,916 మందికి, 2020లో 2,00,152 కి, 2021లో 2,10,532, 2022లో 2,17,647, 2023లో 2,39,818 మందికి రైతుబంధు సాయం అందింది. ఆరేండ్ల వ్యవధిలో రూ.2,030.86 కోట్ల పంట సాయం రైతుబంధు ద్వారా జిల్లా రైతులకు అందింది. కేంద్ర ప్రభుత్వం 15 క్వార్టర్ల కాలంలో రూ.376.71 కోట్ల పంటసాయాన్ని మాత్రమే ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం దానికి 400 రెట్లు అధికంగా అందజేసింది.

డిసెంబర్ 2018	1,44,545	జగిత్యాల జిల్లాలో
ఏప్రిల్ 2019	1,43,166	పీఎం కిసాన్ సమ్మాన్
ఆగస్టు 2023	71,140	నిధి లబ్ధిదారులు

జగిత్యాల జిల్లాలో రైతుబంధు లబ్ధిదారులు



అర్థంపర్థంలేని నిబంధనలు

పీఎం కిసాన్ సమ్మాన్‌లో అర్థంపర్థంలేని నిబంధనలు రైతులకు శాపంగా మారాయి. ఆధార్‌కార్డును బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయని రైతులకు ఈ పథకం వర్తించడం లేదు. ఆదాయపన్ను చెల్లించేవారు కూడా పథకం నుంచి లబ్ధి పొందలేకపోతున్నారు. 2018 తర్వాత వ్యవసాయ భూమి పట్టదారులకు పథకాన్ని అందడం లేదు. రేషన్‌కార్డులో ఒక్కరికి మాత్రమే వర్తింపజేస్తున్నారు. ఉమ్మడి కుటుంబంలోని వారికి వేర్వేరుగా భూములు ఉన్నప్పటికీ పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులను పథకం నుంచి మినహాయించారు. రూ. 10 వేల పెన్షన్ అందుకుంటున్నా ఇవ్వడం లేదు. చట్టసభ్యులకు, ప్రైవేటు రంగ సంస్థల్లో పెద్ద పోస్టుల్లో పనిచేసే ఉద్యోగులను కూడా కిసాన్ సమ్మాన్ నిధికి పరిగణనలోకి తీసుకోవడం లేదు.

ఐటీ కడితే.. సాయం కట్

సత్యనారాయణ (పేరు మార్చాం)ది జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ. నాలుగు ఎకరాలున్న ఈ రైతుకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. బలహీనవర్గానికి చెందిన సత్యనారాయణ బతికేది వ్యవసాయం పైనే. పిల్లల్ని ఇంజినీరింగ్ చదివించాలనుకున్న సత్యనారాయణకు రైతుబంధు వస్తున్నది. కేంద్ర పథకమైన పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి కూడా లబ్ధిదారుడుగా ఎంపికయ్యాడు. మూడు విడతలుగా ఏటా రూ. 6 వేలు వచ్చేవి. పిల్లల ఇంజినీరింగ్ చదువు పూర్తయ్యే దశకు చేరడంతో వారిని ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపాలని సత్యనారాయణ నిర్ణయించుకున్నాడు. ఎడ్యుకేషన్ లోన్ కోసం బ్యాంకును సంప్రదిస్తే ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాల్సి ఉంటుందని చెప్పడంతో వారు చెప్పినట్టే చేశాడు. అది మొదలు ఆయనకు కిసాన్ సమ్మాన్ నిధి పంట సాయం ఆగిపోయింది. ఎందుకని ఆరా తీస్తే అసలు విషయం తెలిసి ఆశ్చర్యపోయాడు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేయడంతో ఆదాయ పరిమితిని లెక్కలోకి తీసుకుని పథకం లబ్ధిదారుల జాబితా నుంచి తన పేరును తొలగించినట్టు తెలిసి విస్తుపోయాడు.

ఎనిమిదో విడత నుంచి వస్తలేవు

జగిత్యాల మండలం ధరూర్‌లో ఎకరం భూమి సాగు చేస్తున్నా. రైతుబంధు సాయం ప్రతి ఏడాది వస్తున్నది. కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా ఏడువిడతలు అందించారు. ఎనిమిదో విడత నుంచి డబ్బులు వస్తలేవు. ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతున్నది. నా బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకు చేయించిన. అయినా డబ్బులు పడతలేవు. ఎందుకు వస్తలేవో అర్థం కావడం లేదు. నాతోటి రైతులకు వచ్చి నాకు ఆగిపోయినయ్.

– కొలువూరి రవీందర్‌రావు, రైతు, ధరూర్, జగిత్యాల

మూడుసార్లు దరఖాస్తు ఇచ్చిన

గుట్రాజ్‌పల్లిలో ఎకరం 35 గుంటల భూమిని సాగు చేస్తున్నా. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కోసం అందరితోపాటు నేనూ దరఖాస్తు పెట్టుకున్నా. గ్రామంలో కొందరు రైతులకు పథకం ద్వారా సంవత్సరానికి రూ. 6000 వస్తున్నయి. నాకు మాత్రం రావడం లేదు. వీలున్నప్పుడల్లా జగిత్యాలకు వెళ్లి ఆఫీసులో కలిసి వస్తున్నా. దరఖాస్తును మూడుసార్లు ఇచ్చినా రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు బంధుసాయం ప్రతి ఏటా వస్తున్నది. కిసాన్ సమ్మాన్ పథకం మాత్రం రావడం లేదు.

– జంగిలి గంగయ్య, రైతు, గుట్రాజ్‌పల్లి, జగిత్యాల మండలం

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి

దేశవ్యాప్తంగా పథకం అమలు తీరు

సంవత్సరం	నిధుల విడుదల (రూ. కోట్లలో)	లబ్ధిదారులు (కోట్లలో)
2019-20	48,723	8.23
2020-21	61,927	9.84
2021-22	67,032	10.41
2022-23	57,646	8.02
2023-24 (అంచనా)	51,397	7.56

ఆధారం: పార్లమెంటులో కేంద్రప్రభుత్వ ప్రకటన, పీఐబీ గణాంకాలు

తెలంగాణలో కిసాన్ సమ్మాన్ నిధి పథకం తీరు

సంవత్సరం	నిధుల విడుదల (రూ. కోట్లలో)	లబ్ధిదారులు (లక్షల్లో)
2019-20	2,110	35.24
2020-21	2,182	36.38
2021-22	2,191	36.52
2022-23	2,148	35.81
2023-24(అంచనా)	1,770	29.5

ఆధారం: పీఐబీ గణాంకాలు

విసిగిపోయి చాలించుకున్న

నేను గుట్రాజ్‌పల్లిలో మూడెకరాల భూమిని సాగు చేస్తున్నా. ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు సాయం వస్తున్నది. కేంద్ర నుంచి కిసాన్ సమ్మాన్‌యోజన పథకం పైసలు వస్తలేవు. రెండుమూడుసార్లు ఏఈవోలకు దరఖాస్తు ఇచ్చి ఆన్‌లైన్ చేయించుకున్నా డబ్బులు రాలే. ఆ పథకం ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు నాకు డబ్బులు రాలే. దీనిపై జగిత్యాల అగ్రికల్చర్ ఆఫీసుకు వెళ్లి అధికారులను కలిసి వినతి పత్రం సమర్పించుకున్నా. డబ్బులు వస్తాయని చెపుతున్నారే తప్ప అవి మాత్రం రావడం లేదు. ఇక తిరగడం నా వల్ల కాక విరమించుకున్నా.

– పయ్యావుల తిరుపతిరెడ్డి, గుట్రాజ్‌పల్లి, జగిత్యాల

చిత్రం

ఒకే పాటలో ముగ్గురు భామలతో..

ఒకేపాట.. ఒకే హీరో.. ఇద్దరు హీరోయిన్లు.. ఇది ఒకప్పుడైతే కామన్. ఇప్పుడు ఆ ట్రెండ్ లేదు. అయితే.. ప్రభాస్ కొత్త ట్రెండ్‌కి తెరలేపారు. ఆయన నటిస్తున్న 'రాజా సాబ్' సినిమాలో ఏకంగా ముగ్గురు భామలతో ఆడిపాడనున్నారు. నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, మాళవిక మోహనన్.. ఈ ముగ్గురూ ఒకే పాటలో ప్రభాస్‌తో స్టెప్పులేయనున్నారట. 'మిర్చి' తర్వాత ప్రభాస్ హీరోయిన్లతో స్టెప్పులేయలేదు. మారిన ఇమేజ్ కారణంగా ఆ తరహా సినిమాలకు దూరమయ్యారనే చెప్పాలి. ఇప్పుడు దర్శకుడు మారుతీ పుణ్యమా అని మళ్లీ 'మిర్చి' నాటి ప్రభాస్‌ను తెలుగు ప్రేక్షకులు చూడబోతున్నారని విశ్వసనీయ సమాచారం. అభిమానులతో ఈలలు వేయించే డాన్స్ మూమెంట్స్‌తో ఈ పాట ఉండనుందని తెలుస్తున్నది. పైగా ప్రభాస్ నటిస్తున్న తొలి కామెడీ హారర్ మూవీ 'రాజా సాబ్'. మారుతీ 'ప్రేమకథా చిత్రం' తరహాలో హారర్‌తో పాటు అద్భుతమైన కామెడీ కూడా ఇందులో ఉంటుందట. ప్రభాస్ లాంటి సూపర్‌స్టార్‌తో ఇలా కామెడీ హారర్ సినిమా తీయడం నిజంగా ప్రమోగమే అని చెప్పాలి. సంజయ్‌దత్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడు.

షూటింగ్ షురూ చేసేది ఆరోజే

మహేశ్, రాజమౌళి సినిమాపై వస్తున్న అప్‌డేట్‌లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. ఈ సినిమా గురించి పలు వేదికల్లో కథారచయిత విజయేంద్రప్రసాద్ కొన్ని లీకుల్ని ఇచ్చారు. తాను, రాజమౌళి దక్షిణాఫ్రికా నవలా రచయిత విల్బర్ స్మిత్‌కు పెద్ద అభిమానులమని, ఆయన పుస్తకాల ఆధారంగానే ఈ స్క్రిప్ట్‌ని రాశామని ఆయన ఓ వేదికపై చెప్పిన విషయం తెలిసిందే. హనుమంతుని లక్షణాలతో ఇందులో మహేశ్ పాత్రను రాజమౌళి డిజైన్ చేసినట్టు సమాచారం. ఇదిలావుంటే.. ఇందులో మహేశ్‌కు జోడీగా ఓ విదేశీభామ నటిస్తున్నట్టు గతంలో వార్తలొచ్చాయి. తాజా సమాచారం మేరకు ఆమెతో పాటు అలియాభట్ కూడా ఇందులో భాగం కానున్నదట. మరి ఆమెది హీరోయిన్ పాత్రా? లేక ప్రత్యేక పాత్రా? అనేది తెలియాల్సివుంది. సూపర్‌స్టార్ కృష్ణ పుట్టినరోజైన మే 31న ఈ సినిమాకు సంబంధించిన తొలి ప్రెస్‌మీట్‌ని మేకర్స్ నిర్వహించనున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. అలాగే మహేశ్ పుట్టినరోజైన ఆగస్ట్ 9న పూజా కార్యక్రమంతో ఈ సినిమా షూటింగ్‌కు శ్రీకారం చుట్టాలని రాజమౌళి భావిస్తున్నారట. ఎస్.ఎస్.రాజమౌళి మార్క్ కథనంతో తెరకెక్కనున్న ఈ సినిమాకు ఎం.ఎం.కీరవాణి స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే. కె.ఎల్.నారాయణ ఈ ప్రతిష్టాత్మక పాన్ వరల్డ్ సినిమాకు నిర్మాత.

'కన్నప్ప'లో మిల్కీబ్యూటీ ప్రత్యేకగీతం?



మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' సినిమా నక్షత్రాల పాలపుంతను తలపిస్తున్నది. మంచు విష్ణు టైటిల్‌రోల్ చేస్తున్న ఈ మైథలాజికల్ మూవీలో సూపర్‌స్టార్లయిన శివరాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, ప్రభాస్‌లు కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో సూపర్ స్టార్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో చేరారట. ఆయనే మోహన్‌లాల్. ఇందులో ఆయన ఆదివాసీ తెగకు చెందిన ఓ నాయకుడిగా కనిపిస్తారని వినికిడి. ఇదిలావుంటే.. తమన్నా భాటియా కూడా 'కన్నప్ప'లో భాగం అయినట్టు తెలుస్తున్నది. ఇందులో ఓ ప్రత్యేక గీతంలో ఆమె మెరవనున్నదట. రజనీకాంత్ 'జైలర్' సినిమాలో ఆమె చేసిన స్పెషల్ సాంగ్ ఎంతటి సంచలనాన్ని సృష్టించిందో తెలిసిందే. ఇప్పుడు 'కన్నప్ప'లో కూడా ఆమె స్పెషల్ సాంగ్ చేస్తున్నదని ఫిల్మ్ వర్గాల సమాచారం. అయితే.. ఆ వార్తపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రాలేదు. ముఖేష్‌కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న విషయం విదితమే.

'కల్కి' టైటిల్ వెనక

ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898ఏడీ' చిత్రం జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. కొద్దిరోజుల క్రితం విడుదల చేసిన డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. భారతీయ పురాణేతిహాసం మహాభారతం, సైన్స్ అంశాల కలబోతగా ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టిస్తూ దర్శకుడు నాగ్‌అశ్విన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన వీఎఫ్ఎక్స్ సదస్సులో పాల్గొన్న నాగ్‌అశ్విన్ 'కల్కి' సినిమా కథ తాలూకు పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చాడు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన ప్రచార చిత్రాన్ని ఉదహరించిన ఓ జర్నలిస్ట్ 'హాలీవుడ్ 'డ్యూన్' సినిమాతో 'కల్కి'కి ఏమైనా సంబంధం ఉందా?' అని ప్రశ్నించగా, దీనిపై నాగ్‌అశ్విన్ స్పందిస్తూ 'రెండు చిత్రాల పోస్టర్స్‌లో ఇసుక బ్యాక్‌గ్రౌండ్ కనిపిస్తుంది. అందుకే పోలిక తీసుకొస్తున్నారు. నిజానికి రెండూ పూర్తి భిన్నమైన కథలు' అని చెప్పారు. సినిమా టైటిల్ గురించి నాగ్‌అశ్విన్ మాట్లాడుతూ 'మహాభారతం చివర్లో మొదలై రానున్న 2898 ఏడీలో ముగిసే కథ ఇది. అందుకే ఆ టైటిల్ పెట్టాం. 6000 ఏళ్ల కాల వ్యవధి వరకు నడిచే కథ ఇది' అని వివరించారు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటున్నది.

వేసవిలో గణేశా ఆగమనం

ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గం..గం..గణేశా'. ఉదయ్‌శెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. మే 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఓ కొండ అంచున నిలబడి ఉన్న ఆనంద్ దేవరకొండ గన్ ఫైర్ చేయడం..ఆ గన్ నుంచి గులాబి రేకులు బయటకు వస్తున్నట్లు డిజైన్ చేసిన పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ వేసవిలో ప్రేక్షకులకు కొత్త అనభూతినందిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిషోర్, జబర్దస్త్ ఇమాన్యూయల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం: చేతన్ భరద్వాజ్, రచన-దర్శకత్వం: ఉదయ్‌శెట్టి.

బాక్ కథేంటి? తనేం చేసింది?

'అరణ్మనై' సిరీస్ నుంచి రానున్న నాలుగవ చిత్రం 'అరణ్మనై 4'. ఈ చిత్రం 'బాక్' పేరుతో మే 3న తెలుగులో విడుదల కానుంది. సుందర్.సి స్వీయదర్శకత్వంలో నటించిన ఈ చిత్రంలో తమన్నా భాటియా, రాశీఖన్నా కథానాయికలు. ఖుష్బు సుందర్, ఏసీఎస్ అరుణ్‌కుమార్ నిర్మాతలు. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా థియేట్రికల్ ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'వినోదమే ప్రధానంగా రూపొందిన చిత్రం 'బాక్'. కుటుంబ ప్రేక్షకులను కూడా నచ్చే సినిమా ఇది. చిన్నపిల్లల నుంచి మహిళల వరకూ అందరినీ అలరించిన సిరీస్ 'అరణ్మనై'. ఈ సినిమాతో మరో సూపర్‌హిట్ ఇవ్వనున్న మా దర్శకుడు సుందర్.సికి థ్యాంక్స్. దర్శకుడు చెప్పింది అర్థం చేసుకొని నటించే ఆర్టిస్టులు ఈ సినిమాకు కుదిరారు. సాంకేతికంగా కూడా ఈ సినిమా నెక్స్ట్ లెవల్లో ఉంటుంది. అస్సామీ జానపదంలో 'బాక్' అనే దెయ్యం ఉండేదని ఈ స్క్రిప్ట్ రీసెర్చ్‌లో సుందర్ తెలుసుకున్నారు. అసలు ఆ 'బాక్' కథేంటి? తనేం చేసింది? అనేది ఈ సినిమా చూస్తే తెలుస్తుంది' అని ఖుష్బు సుందర్ చెప్పారు. ఇంకా తమన్నా, రాశీఖన్నా, కోవైసరళ, నిర్మాత జాన్వీ నారంగ్ కూడా మాట్లాడారు.

ఇలాంటి కథ ఇండియాలో రాలేదు

'దర్శకుడు అర్జున్ ఈ కథ చెప్పినప్పుడు ఎక్సయిటింగ్‌గా అనిపించింది. సుహాస్‌కి విభిన్నమైన కథలు బాగా నప్పుతాయి. ఇది ఫేస్ బ్లైండ్‌నెస్ కాన్సెప్ట్. ఇలాంటి కథ ఇండియాలో ఇప్పటివరకూ రాలేదని నా అభిప్రాయం' అంటున్నారు నిర్మాత జె.ఎస్.మణికంఠ. ఆయన నిర్మిస్తున్న చిత్రం 'ప్రసన్నవదనం'. సుహాస్ కథానాయకుడు. పాయల్ రాధాకృష్ణ, రాశి సింగ్ కథానాయికలు. అర్జున్ వై.కె దర్శకుడు. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మణికంఠ విలేకరులతో ముచ్చటించారు. 'ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా సినిమా చేశాం. నిర్మాణంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. బిజినెస్ పరంగా లాభాల్లో ఉన్నాం. అగ్రనిర్మాణ సంస్థలైన మైత్రీ, హోంబలే సినిమాని విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని తెలిపారు మణికంఠ. దర్శకుడు అర్జున్ అద్భుతంగా వర్క్ చేసి, పకడ్బందీగా ఈ కథ రాశాడని ఆయన చెప్పారు. ఎవరు సలహాలు చెప్పినా తీసుకుంటాడని, సినిమాకు ఏది మంచో అదే చేస్తాడనీ, చెప్పిన దానికంటే గొప్పగా తీశాడని మణికంఠ తెలిపారు. 'సుహాస్ తెలుగు పరిశ్రమకు దక్కిన అదృష్టం. ఇప్పుడు దర్శకులందరూ సుహాస్‌ని దృష్టిలో పెట్టుకొనే కథలు రాస్తున్నారు. నిర్మాత, దర్శకులను ఇబ్బందిపెట్టని క్రమశిక్షణగల నటుడు సుహాస్. తనతో వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు మణికంఠ. సాంకేతికంగా కూడా సినిమా నెక్స్ట్ లెవల్లో ఉంటుందని, తరువాతి సినిమా కూడా సుహాస్‌తోనే ఉంటుందని మణికంఠ తెలిపారు.

అందరికీ నచ్చే 'ఆ ఒక్కటీ అడక్కు'

'పెళ్లి చుట్టూ ఎలాంటి ఎమోషన్స్ ఉంటాయి? ఆ ఎమోషన్స్‌ని కొందరు ఎలా క్యాష్ చేసుకుంటున్నారు? ఈ ప్రశ్నలకు వినోదాత్మక సమాధానం మా 'ఆ ఒక్కటీ అడక్కు'. అందరూ కనెక్టయ్యే కంటెంట్ ఇది' అంటున్నారు దర్శకుడు మల్లి అంకం. ఆయన దర్శకునిగా పరిచయం అవుతున్న చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించారు. రాజీవ్ చిలక నిర్మాత. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు మల్లి విలేకరులతో ముచ్చటించారు. 'పెళ్లి గురించి అందరూ తేలిగ్గా అడిగేస్తారు. కానీ తీసుకునే వాళ్లు దాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటారు. కుటుంబానికి కూడా అదో బాధ. ఆ ఉద్వేగాన్నే కామెడీతో చెప్పాం. అలాగే పెళ్లి సంబంధాల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ సినిమాలో చూపించాం. పెళ్లి గురించి అడిగినప్పుడు హీరో చెప్పే సమాధానమే 'ఆ ఒక్కటీ అడక్కు'' అని తెలిపారు మల్లి. నాలుగు సినిమాలతో బిజీగా ఉన్న నరేశ్, కామెడీ కథ అనేసరికి ముందు అంత ఉత్సాహం చూపించలేదని, అయితే కథ చెప్పడం మొదలుపెట్టాక, ఫస్టాఫ్ వినగానే 'మనం ఈ సినిమా చేస్తున్నాం' అనేసి షేక్ హ్యాండిచ్చారని, తను ఓకే చేసిన ప్రాజెక్టులను వెనక్కు నెట్టి మరీ ముందు ఈ సినిమా చేశారని, అంతలా ఈ కథ నరేశ్‌ని ఆకట్టుకుందని మల్లి చెప్పారు. 'ఫరియా అందంతోపాటు కామెడీ టైమింగ్ ఉన్న నటి. ఇందులో కథను మలుపుతిప్పే పాత్ర ఆమెది. అబ్బూరి రవిగారు మాటలు ఆకట్టుకునేలా ఉంటాయి. గోపీసుందర్ పాటలు అద్భుతంగా ఉంటాయి. ఈ కథకు కావాల్సిన బడ్జెట్‌ని సమకూర్చి, సినిమా బాగా రావడానికి కారకులు మా నిర్మాత రాజీవ్ చిలకగారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను' అన్నారు. మల్లి అంకం.